ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 29 జూలై 2025



మదపుటేనుగుల కట్టడికి కుంకీలు సిద్ధం

శిక్షణ దాదాపు పూర్తయిందంటున్న అటవీశాఖ



పలమనేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు కష్టపడి పండించిన పంటలను ధ్వంసం చేస్తూ అప్పుడప్పుడూ రైతులపై దాడులకు దిగుతూ ఒక్కోసారి వారి మరణాలకూ కారణమవుతున్న మదపుటేనుగులను కట్టడి చేసేందుకు కుంకీ ఏనుగులు సిద్ధమవుతున్నాయి. కర్ణాటక నుంచి పలమనేరు ఎలిఫెంట్ క్యాంపుకు తీసుకొచ్చిన కుంకీలను ఇక్కడి వాతావరణానికి అలవాటు చేయిస్తున్నారు.తమిళనాడు నుంచి జిల్లాకు వచ్చిన ఏనుగులు దశాబ్దాలుగా పంటపొలాలను తీవ్రంగా నష్టపరచడంతో పాటు ఇప్పటివరకూ 80మందికి పైగా రైతులను పొట్టన పెట్టుకొన్నాయి.ఈ ఏనుగుల దాడులను అరికట్టడానికి అటవీశాఖ పలు కార్యక్రమాలను నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది.1980వ దశకంలో జిల్లాకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఏనుగుల వలన జరుగుతున్న పంట నష్టాలను అరికట్టేందుకు అటవీప్రాంత సరిహద్దులో సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు.తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సోలార్ ఫెన్సింగ్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో వృధాగా మారింది. దశాబ్దం క్రితం ప్రభుత్వం ఆటవీ ప్రాంతంనుంచి ఏనుగులు వెలుపలికి రాకుండా అటవీ సరిహద్దు పొడవునా కందకాలు తవ్వించింది. అయితే ఈ కందకాలు తవ్వేందుకు కొన్ని చోట్ల బండలు అడ్డు వచ్చాయి. అలాంటి ప్రదేశాలనుంచి ఏనుగులు అటవీప్రాంతం నుంచి వెలుపలికి వచ్చి పంటలను నాశనం చేస్తూ వచ్చాయి.చివరకు జిల్లా రైతాంగం ఏనుగులతో సహజీవనం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు ఏ పంటలు పండించినా కోత దశకు రాగానే ఏనుగుల గుంపు రావడం.... పంటను తొక్కి నాశనం చేయడం జరుగుతుండడంతో చివరకు రైతులు పంటల సాగుకే స్వస్తి చెప్పారు. కొందరు రైతులేమో ఏనుగులనుంచి పంటలను రక్షించుకొనేందుకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడంతో కొన్ని ఏనుగులు విద్యుత్ షాక్‌తో చనిపోయాయి. ఈ సంఘటనలపై రైతులపై అటవీశాఖ కేసులు నమోదు చేయడం జరిగింది. గజదాడుల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తోంది. రెండేళ్లక్రితం కర్ణాటక రాష్ట్రంలో ఏనుగులను కట్టడి చేసేందుకు ప్రయోగాత్మకంగా హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.ఇది సత్ఫలితాలను ఇస్తున్నట్లు గుర్తించిన మన అటవీశాఖ కూడా పలమనేరు మండలంలోని పెంగరగుంట వద్ద హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసింది.ఈ ఫెన్సింగ్‌తో తమకు ఏనుగుల నుంచి రక్షణ ఉంటుందని రైతులు కోరినా అటవీశాఖ అధికారులు నిధుల లేమి కారణంగా హ్యాంగింగ్ సోలార్‌ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేకపోయారు. గత వైసీపీ ప్రభుత్వానికి ఈ విషయమై అటవీశాఖ ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు.గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏనుగుల దాడులను అరికట్టేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి కుంకీ(శిక్షణ పొందిన) ఏనుగులను తీసుకు రావాలని నిర్ణయం తీసుకొంది. ఈ కుంకీ ఏనుగుల కోసం పలమనేరు సమీపంలోని ముసలిమడుగు వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో లక్షలాది రూపాయలను వెచ్చించి ఏర్పాట్లు చేసింది.ఏనుగులకోసం నీటి తొట్టెల నిర్మాణం, చెరువుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కోసం బోర్ల తవ్వకం , ఏనుగులకు రెండుపూటలా సంగటి ముద్దలు తయారు చేసేందుకు వంటగదులు, ఏనుగులు వుండేందుకు పెద్దపెద్ద షెడ్లు, ఎలిఫెంట్ క్యాంపు లోపలికి ఇతర వన్యప్రాణులు రాకుండా కందకాలు నిర్మించడంతో పాటు సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి రెండు దఫాలుగా ఇక్కడికి 6 ఏనుగులను తీసుకొచ్చారు.ఏనుగులతో పాటు ఇక్కడికి వచ్చిన మావటీలు ఇక్కడి అటవీశాఖ సిబ్బందికి ఏనుగుల సంరక్షణ, పోషణపై శిక్షణ ఇచ్చారు. కుంకీలను రోజూ ఉదయం 10 గంటలకు మావటీల సాయంతో ఎలిఫెంట్‌క్యాంపు నుంచి అటవీ ప్రాంతంలోకి తీసుకు వెళ్లి రావి, మర్రి, జువ్వి చెట్లను నరికి వాటికి ఆహారంగా ఇస్తున్నారు.ఉదయం, సాయంత్రం కుంకీలకు సంగటి ముద్దలు పెడుతున్నారు.ఓ కుంకీ ఏనుగుకు ఒక కంటి చూపు పాక్షికంగా మందగించినట్టు గుర్తించి వైద్యం అందించారు.ఇక్కడి బాష, వాతావరణం కొత్త కావడంతో మరో కుంకీ అలజడి సృష్టించడంతో దాన్ని మచ్చిక చేసుకొనేందుకు 20రోజుల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన క్రాల్‌లో బంధించారు. క్రమంగా అది కూడా మన అటవీ సిబ్బంది, మావటీల సంజ్ఞలను అర్థంచేసుకుంటోందని , దీన్ని త్వరలోనే క్రాల్‌నుంచి వెలుపలికి తీసుకొస్తారని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.



పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగులు



ఒంటరి ఏనుగులపైనే తొలి ప్రయోగాలు

మొదటి దశలో ఒంటరిగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్న మదపుటేనుగులను కుంకీల సాయంతో ఎలిఫెంట్ క్యాంపుకు తరలించి క్రాల్‌లో బంధించి అదుపులోకొచ్చిన తరువాత అటవీ లోతట్లు ప్రాంతాలకు పంపిస్తారని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక మందలు మందలుగా తిరుగుతున్న ఏనుగుల వంతెప్పుడొస్తుందో చూడాలి. కుంకీల కంటే రైతులకు పంట పొలాల చుట్టూ సోలార్ విద్యుత్ కంచె నిర్మాణాలకు వంద శాతం సబ్సిడీని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేయడం మంచి పరిష్కారమవుతుందని జిల్లా రైతు సంఘ నాయకుడు ఉమాపతి నాయుడు అభిప్రాయపడ్డారు.

నెలలోపు రంగంలోకి కుంకీలు : డీఎఫ్‌వో భరణి



చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శిక్షణ దాదాపు పూర్తయిన క్రమంలో నెలలోపు కుంకీ ఏనుగులను రంగంలోకి దించనున్నట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. ఏనుగుల దాడులు ముమ్మరమైన క్రమంలో కుంకీల పరిస్థితి గురించి ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఆరా తీయగా అడవుల్లో ఎన్ని ఏనుగులున్నాయి? అవి ఎన్ని గుంపులుగా ఉన్నాయి? ఎక్కువగా ఏ ప్రదేశాల్లోకి వస్తున్నాయి? అనే అంశాలను నిశితంగా గమనిస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు.మొదట ఎక్కువ దాడులు జరుగుతున్న ప్రాంతాల్లో ఏనుగులను అడవిలోకి పంపేందుకు కుంకీలు సాయం తీసుకుంటామన్నారు. కర్ణాటక నుంచి మూడు నెలల క్రితం తెప్పించిన నాలుగు కుంకీలతో పాటు వచ్చిన మావటీలు వెళ్లిపోయారని, దీంతో జిల్లా అటవీ శాఖలో కొందరిని మావటీలుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామన్నారు. దీంతో పాటు కుంకీలు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా శిక్షణ ఇస్తున్నామన్నారు..కుంకీలకు, ఇక్కడి మావటీలకు సమన్వయం కుదరాల్సి ఉందని, లేకుంటే అవి ఎదురు తిరిగే ప్రమాదముందన్నారు.మరో వైపు ఏనుగుల దాడులు అరికట్టేందుకు చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో ఇప్పటికే సోలార్ రిఫ్లక్టింగ్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు.ఏనుగులు తరచూ తిరిగే ప్రాంతాలను గుర్తించి 50 కిలో మీటర్ల పరిధిలో కిలో మీటరుకు కనీసం పది లైట్లు ఏర్పాటు చేస్తామని డీఎఫ్‌వో భరణి వివరించారు.



వైరం మరచి..ప్రేమను పంచి..

రొంపిచెర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఓ శునకం జాతి వైరాన్ని పక్కన పెట్టింది. ప్రేమాభిమానాన్ని పంచింది. మానవత్వాన్ని చాటుకుంది. సాధారణంగా పిల్లీకుక్కలెప్పుడూ కలహించుకోవడం చూస్తుంటాం. ఇందుకు భిన్నంగా ఓ శునకం పిల్లికి పాలిస్తూ ఆశ్చర్యపరిచింది. రొంపిచెర్ల మండలంలోని మోటుమల్లెల పంచాయతీ నగిరి హరిజనవాడలో సోమవారం తారసపడిన ఈసన్నివేశం ఆకర్షించింది.

త్వరలోనే రూ.150 కోట్ల తోతాపురి 'సబ్సిడీ' జమ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన తోతాపురి మామిడి రకానికి సబ్సిడీ సొమ్ము రూ.150 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు త్వరలోనే జమ చేస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి జేసీ విద్యాధరితో కలిసి వ్యవసాయ అనుబంధ మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. ఆగస్టు ఒకటో తేదీలోపు క్షేత్రస్థాయిలో తోతాపురి మామిడి కాయలను ఫ్యాక్టరీలకు అందించిన రైతుల రికార్డులు, నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఇతర రాష్ట్రాలకు తరలించిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందన్నారు. పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన మామిడి రైతుల జాబితా సమగ్ర వివరాలు పొందుపరచాలన్నారు. వేపగుంట, కార్వేటినగరం, నిండ్ర, పులిచెర్ల మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ పాల్గొన్నారు.



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో పెంచలకిషోర్

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.81 కోట్లు

ఐరాల(కాణిపాకం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయ హుండీ ఆదాయం రూ.1,81,84,138 లభించింది. సోమవారం ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో స్వామి హుండీ కానుకలను సిబ్బంది లెక్కించారు. 40 గ్రాముల బంగారు, 790 గ్రాముల వెండితోపాటు 2,488 యూఎస్‌ఏ, 55 కెనడా డాలర్లు, 5 ఇంగ్లాండ్ పౌండ్లు, 230 యూఏఈ దిర్హామ్స్ 20 యూరోలు లభించాయి. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.21,032, ఆలయ అన్నదాన కేంద్ర వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా 53,031 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలియజేశారు. ఆలయానికి ఈ ఆదాయం 24 రోజుల్లో వచ్చినట్లు చెప్పారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, ధనపాల్, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి పాల్గొన్నారు.

ముగిసిన అసెస్‌మెంట్ల పరిశీలన

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 677 అసెస్‌మెంట్లను పరిశీలించిన మున్సిపల్ సిబ్బంది
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పణ



మదనపల్లెలో ఇంటికి కొలతలు వేస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో అసెస్‌మెంట్ల పరిశీలన కార్యక్రమం ముగిసింది.గతంతో పోలిస్తే ఏడాదికి రూ. 46.53 లక్షల ఆదాయం తగ్గడంతో ఎక్కడైనా పొరబాట్లు, తప్పులు జరిగివుంటే గుర్తించేందుకు ప్రభుత్వం అసెస్‌మెంట్లను రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించింది.ఇందుకోసం ఒక మున్సిపాలిటీ నుంచి మరో మున్సిపాలిటీకి పరిశీలన అధికారులు, సిబ్బందిని కేటాయించారు. ప్రధానంగా బైఫర్‌కేషన్, తప్పుడు కొలతలు, డెమాలిష్ తదితర అంశాల పరిశీలన కార్యక్రమం జరిగింది. ఆర్‌వో, ఆర్‌ఐ, ఇతర సిబ్బంది కలిసి ఈ నెల 24, 25, 26 తేదీలలో నగరి, బి.కొత్తకోట, పలమనేరు, పుత్తూరు, తిరుపతి, మదనపల్లె, చిత్తూరు, పుంగనూరు, కుప్పం పంచాయతీలలో అసెస్‌మెంట్లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు.

ఎవరెవరిని ఎక్కడెక్కడ పంపించారంటే...

చిత్తూరు నగరపాలక సంస్థకు చెందిన 20 మంది ఆర్వో, ఆర్ఐ, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీలను మదనపల్లెకు కేటాయించారు. వీరు అక్కడ 153 అసెస్‌మెంట్లకు సంబంధించి పరిశీలన చేశారు. మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన 20 మంది ఆర్వో, ఆర్ఐ, సిబ్బందిని తిరుపతికి కేటాయించారు. అక్కడ 99 అసెస్‌మెంట్లను పరిశీలించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి చెందిన 20 మందిని పుంగనూరుకు కేటాయించగా, అక్కడ 97 అసెస్‌మెంట్లను, పుంగనూరుకు చెందిన పదిమంది శ్రీకాళహస్తిలో 86 అసెస్‌మెంట్లను, పలమనేరుకు చెందిన పదిమంది సిబ్బంది పుంగనూరులో 97 అసెస్‌మెంట్లను, పుత్తూరుకు చెందిన 11మంది సిబ్బంది కుప్పంలో 24 అసెస్‌మెంట్లను, నగరికి చెందిన 11 మంది బి. కొత్తకోటలో 58 అసెస్‌మెంట్లను, తిరుపతికి చెందిన 21 మంది చిత్తూరులో 179 అసెస్‌మెంట్లను పరిశీలించారు.

పరిశీలనలో చేసిన పనులేమిటంటే...

ముఖ్యంగా తప్పుడు కొలతలు, బైఫర్‌కేషన్, డెమాలిషన్ భవనాలపై ఫిర్యాదులు రావడంతో ఈ మూడు అంశాలపై సిబ్బంది పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. అసెస్‌మెంట్ల జాబితాతో క్షేత్రసాయికి వెళ్లి ప్రత్యక్షంగా చూసి రికార్డులో ఉన్నవాటికి, వాస్తవంగా ఉన్న పరిస్థితిని నమోదు చేశారు. ఉదాహరణకు తండ్రి ఆస్తిగా ఉన్న ఇంటిని ఇద్దరు కుమారులు భాగపరిష్కారం చేసుకోవడానికి ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఆప్షన్‌ను ఇవ్వలేదు. దాంతో ఆయా మున్సిపాలిటీల్లో సిబ్బంది అడిషనల్ అల్టేషన్ ఆప్షన్ కింద చేసేశారు. దాంతో ఆ ఇంటికి వచ్చే ట్యాక్స్‌తో పాటు భాగపరిష్కారంలో ఇంకో వ్యక్తికి కూడా అదనంగా ట్యాక్స్ వేశారు. ఇప్పుడు ఆప్షన్ ఇవ్వడంతో ఆదాయం తగ్గింది. అలాగే చాలా చోట్ల భవనాలను తొలగించినప్పటికీ ఖాళీ స్థలాలకు వేయాల్సిన ట్యాక్స్‌ను భవనానికి వేస్తుండటంతో అధికంగా ట్యాక్స్ వచ్చేది. అలాగే గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ (జీ+1) ఉన్నప్పటికీ సెకండ్ ఫ్లోర్ (జీ+2) ఉన్నట్లు ట్యాక్స్ వేశారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో నివేదికను తయారుచేసి త్వరలో ప్రభుత్వానికి పంపనున్నారు.

జీడీనెల్లూరు సర్వేయర్‌పై చర్యలు

సర్వే శాఖ ఏడీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులిచ్చిన జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న సునీత పనితీరుపై ఆరోపణలు రావడంతో ఆమెను డిప్యుటేషన్ కింద కలెక్టరేట్‌లోని సర్వేశాఖ ఏడీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ సోమవారం రాత్రి జేసీ విద్యాధరి ఉత్తర్వులు జారీచేశారు. ఆమె స్థానంలో పాలసముద్రం సర్వేయర్ గణేష్‌కు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గంగాధర నెల్లూరు మండలంలో రైతుల భూముల సర్వే చేయడానికి అధిక మొత్తాలు చెల్లించాలంటూ బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నట్లు ఓ రైతు గతవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' లోనూ కథనం ప్రచురితమైంది. సర్వేయర్ సునీతపై చర్యలు తీసుకోవాలని జేసీని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో పైవిధంగా జేసీ ఉత్తర్వులిచ్చారు.

12న మణీంద్రం ఎంపీటీసీ ఉపఎన్నిక

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మణీంద్రం ఎంపీటీసీ ఉపఎన్నిక ఆగస్టు 12న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. ఉపఎన్నికలకు సంబంధించి సోమవారం షెడ్యూల్ విడుదలైందన్నారు. ఈనెల 30నుంచి ఆగస్టు 1వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఆగస్టు 2న నామినేషన్ల పరిశీలన, 3న నామినుషన్ల తిరస్కరణపై అప్పీలు, 4న అప్పీళ్ళ పరిష్కారం ఉంటుందన్నారు. 5వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. 12న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అవసరమైతే 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రీపోలింగ్ నిర్వహిస్తామన్నారు. 14న ఓట్ల లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారని ఆయన వివరించారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు



పుంగనూరు రూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. సీఐ సుబ్బరాయుడు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. పట్టణ సమీపంలోని నక్కబండ ఇస్లాంనగర్‌కు చెందిన ఫరూక్, తోటి రాజేష్ అలియాస్ రాజాల= మూడేళ్ల క్రితం ఓ అమ్మాయి విషయంలో ఘర్షణ పడ్డారు. ఈక్రమంలోనే రాజేశ్ 2022 జూన్ 22న ఫరుక్ కడుపుపై పొడిచాడు. ఈఘటనపై అప్పటి ఎస్ఐ మోహన్‌కుమార్ నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుడు రాజేష్‌ను అరెస్ట్ చేశారు. పూర్వపరాలు విచారించిన మదనపల్లె 7వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీలత నిందితుడు తోటి రాజేష్(22)కు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ వివరించారు. ముద్దాయికి శిక్ష పడేందుకు కృషి చేసిన నాటి ఎస్ఐ మోహన్‌కుమార్, సీఐ సుబ్బారెడ్డి, ఏపీపీ జయనారాయణరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, కోర్టు మానటరింగ్‌సెల్ సీఐ చంద్రశేఖర్‌ను ఎస్పీ మణికంఠచందోలు అభినందించారన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో పెరిగిన అడ్మిషన్లు

ఇన్‌చార్జి డీఐఈవో దయానందరాజు



చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్ ఇంటర్‌లో గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 369 అడ్మిషన్లు పెరిగినట్లు ఇన్‌చార్జి జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి (డీఐఈవో) దయానందరాజు తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన వివరాలు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 27,331 అడ్మిషన్లు రాగా, 2025-26లో ఆ సంఖ్య 27,700గా ఉందన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ నెలాఖరుతో పూర్తవుతుందని, ఆలోపు మరిన్ని అడ్మిషన్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతేడాది 8,058 అడ్మిషన్లు ఉంటే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 8,028 జరిగాయని, మిగిలిన మూడ్రోజుల్లో గతేడాది లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. ఇదిలా ఉండగా, ఆరు మోడల్ స్కూళ్లు, 20 హైస్కూల్ ప్లస్‌లు, ఎనిమిది కేజీబీవీలు, ఒక ఏపీ రెసిడెన్షియల్, నాలుగు సోషల్ వెల్ఫేర్, 60 ప్రైవేటు యాజమాన్య జూనియర్ కళాశాలల్లో గతేడాది ఫస్టియర్ ఇంటర్‌లో 19,273 అడ్మిషన్లు రాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఆ సంఖ్య 19,672గా ఉందన్నారు. మరోవైపు విద్యా సంవత్సరం క్యాలెండర్ ఆధారంగా సిలబస్ పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

'పీ-4'లో నిర్బంధం సరికాదు: పీఆర్‌టీయూ

చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'పీ-4' పథకంలో భాగంగా విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కన్నన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి హెచ్‌ఎం ఐదు కుటుంబాలను, ఒక్కో టీచర్ కనీసం రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని వివరాలను రెండ్రోజుల్లో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఒత్తిడికి గురిచేయొద్దన్నారు. స్వచ్ఛందంగా టీచర్లు భాగస్వాములైతే హర్షణీయమని, బలవంతం చేయొద్దని విన్నవించారు.




గోపిచంద్ మలినేని - శివరాజ్ కుమార్

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని, కన్నడ నటుడు శివరాజ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఐటీసీటీపీ పురస్కారం అందుకుంటున్న జిల్లా టూరిజం ఆర్డీ రమణప్రసాద్

ఏపీ టూరిజానికి ప్రతిష్ఠాత్మక అవార్డు

ఇంటర్నేషనల్ టూరిజం కాన్క్లేవ్ అండ్ ట్రావెల్ (ఐటీసీటీపీ) సంస్థ ఏపీలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించింది. 'ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డును' ప్రకటించంది. ఈ అవార్డును శనివారం ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధుల నుంచి జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్ అందుకున్నారు. కొన్ని కారణాలతో పర్యాటకఅభివృద్ధి కార్పొరేషన్ ఎండీ అమ్రపాలి వెళ్లకపోవడంతో తిరుపతి ఆర్డీ రమణ ప్రసాద్ అందుకున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 85,486

తలనీలాలు సమర్పించినవారు: 30,929



వాకాడు డిపో నమూనాను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ

బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

- ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

వాకాడు/వెంకటగిరి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, ఫ్యాన్ల ఏర్పాటుతో సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. వాకాడు, వెంకటగిరిలోని డిపోలు, బస్టాండ్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాకాడు డిపో ఆవరణంలో మొక్కలను నాటారు. రెండు చోట్లా డిపో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మీడియాతో మాట్లాడారు. బస్టాండ్లకు కొత్తగా రంగులు వేస్తున్నామని తెలిపారు. వాకాడు డిపో ఆవరణలో సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయనున్నామన్నారు. అన్ని డిపోలో బస్సు సర్వీసులు ఎలా ఉన్నాయో జోన్ల వారీగా తెలుసుకుని కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో వెంకటగిరి, వాకాడు డిపోలను పరిశీలించి సర్వీసులు, సిబ్బందికి సూచనలు అందించామన్నారు. వెంకటగిరిలో మరో రెండు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి అత్యాధునిక బస్టాండ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ ఎండీ వెంట ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చెంగల్‌రెడ్డి, ఈడీవో అప్పలరాజు, వెంకటగిరి, వాకాడు డీఎంలు రామకృష్ణ, పెంచలయ్య, సిబ్బంది ఉన్నారు.

పులి..జాడ ఎక్కడ?

- శేషాచల అడవుల్లో అంతరిస్తున్న వైనం
- ఎస్వీ జూకే పరిమితం
- నేడు జాతీయ పులులం దినోత్సవం



జూపార్కులో రాయల్‌బెంగాల్ టైగర్

దేశంలో పులుల సంఖ్య	
సంవత్సరం	పులుల సంఖ్య
2006	1,411,
2010	1,726
2014	2,226
2018	2,927
2022	3,682 (అంచనా)




జూపార్కులో తెల్ల పులి



పెద్దపులులు

మంగళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెద్దపులి.. వేటలో రారాజు.. రాజసానికి ప్రతీక. దీనిపేరు వింటేనే జనానికి ముచ్చెమటలు పడతాయి. కదలికలో చురుకుదనం, చూపులో తీక్షణం, గాండ్రింపులో వైవిధ్యమున్న ఈ మృగం ఉనికి నానాటికీ అంతరించిపోతోంది. అభయారణ్యంగా పేరొందిన మన శేషాచల అటవీప్రాంతంలో వ్యాఘ్రం మచ్చుకైనా లేదంటే ఆశ్చర్యం,ఆవేదన కలుగుతాయి. ఇప్పుడు పులులు ఎస్వీ జూకు మాత్రమే పరిమితమయ్యాయి.

చాన్నాళ్లుగా ఉనికే లేదు..

దట్టమైన అడవి పెద్దపులులకు ఆవాసానికి అనుకూలం. అడవుల పరిరక్షణలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. శేషాచల పరిధిలోని ఆహార వనరులు, రాతి గుహలు, సెలయేళ్లు, నీటి గుంటలు పులుల మనుగడకు ఉపకరించేవి. ఈ దృష్ట్యా ప్రభుత్వం ఏడాది క్రితం నల్లమల నుంచి బద్వేల్ మీదుగా శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్‌గా ప్రకటించింది. నాలుగు జిల్లాల్లో నాలుగు లక్షల హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ కారిడార్‌లో చాన్నాళ్లుగా పులి సంచరించిన దాఖలాలు లేవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఆరేళ్ల క్రితం చామల రేంజ్ అటవీప్రాంతంలో ఓ పెద్దపులిని గుర్తించినా తర్వాత ఉనికి లేదు. తాజాగా నెల్లూరు, కడప జిల్లాల మధ్య పులుల కార్యకలాపాలున్నట్లు భావించినా నిర్ధారణ కాలేదు. నాగార్జునసాగర్-శ్రీశైలం రిజర్వు ఫారెస్ట్‌లో 95 పెద్దపులులున్నాయని అంచనా.

జూపార్కులో పులుల సందడి

అంతరించిపోతున్న పెద్దపులు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తిరుపతి ఎస్వీ జూపార్కులో రెండు బెంగాల్ టైగర్స్, తొమ్మిది తెల్లపులులు సందర్శకులు కనువిందు చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం తీసుకువచ్చిన నాలుగు పిల్లల్లో రెండు చనిపోయాయి. ఇక్కడి పులులకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి 6కిలోల బీఫ్, రెండు కేజీల చికెన్,రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.4,85,4590 ఖర్చవుతుంది. ఈక్రమంలోనే పులులను దత్తత తీసుకుని ఆహారానికి కొంత ఆర్థిక సాయం సమకూర్చాలని జంతు ప్రేమికులకు జూ అధికారులు కోరుతున్నారు.

సమస్యలివిగో.. పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 289 అర్జీలు

చిత్తూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మొత్తం 289 అర్జీలను అందజేశారు. వీటిల్లో రెవెన్యూశాఖకే అత్యధికంగా 251 అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏ శాఖకు 31, పౌరసరఫరా, పోలీసు శాఖలకు రెండు చొప్పున, జిల్లా కారాగారానికి, పంచాయతీరాజ్, వయోవృద్ధుల సంక్షేమశాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలున్నాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు అర్జీలను తీసుకున్నారు. పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రధాన అర్జీలిలా ఉన్నాయి.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కనే జేసీ విద్యాధరి తదితరులు



శ్మశాన భూమిని ఆక్రమించారు

జొన్నకొప్పులబావి కింద ఉన్న పిల్లవంకలోని శ్మశాన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని ఐరాల మండలంలోని గోవిందరెడ్డిపల్లె యానాదికాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని చెప్పారు.

సొంతింటి నిర్మాణానికి సాయం చేయండి

బాడుగ ఇంట్లో 11 ఏళ్లుగా ఉన్న తనకు సొంతింటి నిర్మాణానికి సాయం చేయాలని గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురానికి చెందిన మంజునాథన్ కోరారు. తన వందశాతం అంగవైకల్యం ఉండటంతో ఏ పనీ చేయలేక ప్రభుత్వం ఇచ్చే పింఛనుతో ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నానని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటిని కట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధాప్య పింఛను మంజూరు చేయండి

తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన పూజారి రవీంద్రసింగ్(63) కోరారు. కుటుంబీకులు ఎవరిదారిన వారు వెళ్లిపోవడంతో తనకు జీవనం కష్టంగా మారిందని వాపోయాడు.

ఇళ్లకు అనుభవపట్టాలివ్వాలి

తాము నివాసముంటున్న ఇళ్లకు అనుభవ పట్టాలను ఇవ్వాలని పూతలపట్టు మండలం క్షీరసాగరం యానాదులు కోరారు. ప్రభుత్వ స్థలంలో 2000వ సంవత్సరంలో 40 కుటుంబాలకు చెందిన తాము ఇళ్లను కట్టుకుని ఉంటున్నామన్నారు.





రోడ్డును ఏర్పాటు చేయండి

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని ఐరాల మండలం ఎర్రేపల్లె పంచాయతీలోని అబ్బుగుండు గ్రామస్తులు కోరారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ కూడా రావడం లేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తారు రోడ్డును వేయాలన్నారు.

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం: ఎస్పీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

బాదితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్పీ మణికంఠ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని నిర్ణీత సమయంలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 36 అర్జీలు వచ్చాయి. వీటిల్లో భూ తగాదాలపై 13, డబ్బు తగాదాలపై 7, ఆస్తి తగాదాలపై 4, చీటింగ్‌పై 3, కుటుంబ తగాదాలపై 3, హత్యాప్రయత్నంపై 2, వేధింపులపై 2, దారి సమస్యపై 1, బెదిరింపులపై ఒకటి చొప్పున అర్జీలున్నాయి.



రంగనాయక మండపంలో వెంకయ్యనాయుడికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అదనపు ఈవో

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన వెంకయ్య నాయుడు ధ్వజస్తంభానికి, తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, కుటుంబ సమేతంగా భగవత్ దర్శనం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. హిందూ ధర్మం ప్రకారం దైవభక్తి ఉండటంతో పాటు సమాజ భక్తి, సేవ, అనురక్తి కూడా కలిగి ఉండాలని సూచించారు.

విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉండగానే రైల్వే హెడ్ కానిస్టేబుల్ కళ్లు తిరిగి కింద పడి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారంలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తిరుపతి జీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఎరికలరెడ్డిది కడప జిల్లా తొండూరు మండలం ఇనగనూరు గ్రామం. ఈయన ఏడేళ్లుగా రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒకటో ప్లాట్‌ఫారంలో విధి నిర్వహణలో వుండగా నీళ్ళు తాగడం కోసం రైల్వే స్టేషన్ వద్దకు వచ్చే క్రమంలో కళ్లు తిరిగి కింద పడ్డారు. అక్కడున్న పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ ఆశీర్వాదం చెప్పారు.

నన్ను టార్గెట్ చేసి నిర్బంధించారు

- వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ

తిరుపతి(జీవకోన), జూలై 28(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లోని ప్రకృతి అందాలను బాహ్యప్రపంచానికి వెబ్ పేజీ ద్వారా చూపుతున్న తనను టార్గెట్ చేసి పుత్తూరు అటవీశాఖ కార్యాలయంలో అక్రమంగా నిర్బంధించారని వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం సదాశివకోన, జలపాతాలను, దేవాలయాలను సందర్శించాలని 20 మంది స్నేహితులతో కలిసి అటవీశాఖ టిక్కెట్లను కొని ఆదివారం వెళ్లామన్నారు. తిరుగు ప్రయాణంలో తమకు అనుమతిచ్చింది ఈ ప్రదేశం వరకే అంటూ పుత్తూరు అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రంతా గదిలో పెట్టి తాళంవేశారన్నారు. తాను చేసిన తప్పేంటని ప్రశ్నించినా పొంతనలేని సమాధానం చెప్పారన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ప్రాంతంలో తమ వద్ద హామీ పత్రాన్ని రాయించుకుని వదిలి పెట్టారన్నారు. తనను అరెస్టు చేసి



నట్లు, అపరాధ రుసుం కట్టించుకున్నారని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ చెప్పినట్లుగా సామాజిక మాధ్యమంలో చూశానన్నారు. దివ్యారామంలో చెట్లు నరికిన అంశంపై తాను చేసిన వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతోనే ఇలా కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. 9 ఏళ్లుగా ప్రకృతి అందాలను చిత్రీకరించి బాహ్య ప్రపంచానికి చూపుతున్న తనకు, ఒక రాత్రిలో పరువు పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన అలిపిరి పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత వివరాల మేరకు.. విజయపురం మండలం మిట్టకండ్రిగకు చెందిన కృష్ణయ్య(55) తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కపిలతీర్థం సమీపంలోని ఆర్చి వద్ద తిరుపతి అటవీ శాఖ రేంజర్ చలపతి చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులకు వెళుతున్నాడు. గోడలకు నీరు పట్టి బోరు ఆపే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఇదేమి ట్రెండ్!

ఒకప్పుడు సమాజాన్ని ప్రభావితం చేసిన నేతల బొమ్మలతో యువత టీ షర్టులు వేసుకునేవారు. ఆ తర్వాత కొటేషన్లు.. క్రమేణా తమ అభిమాన సినీ హీరోలు, రాజకీయ నేతల చిత్రాలతో టీ షర్టులు ధరిస్తూ వచ్చారు. ఇలా తమ అభిమానం చూపుకొనే వారు. మరిప్పుడు గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ ఫొటోతో కూడిన టీ షర్టులు ధరిస్తుండటం జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఇలా.. సోమవారం తడలోని శివాలయానికి ఓ భక్తుడు వీరప్పన్ ఫొటోతో ఉన్న టీషర్టు వేసుకుని రావడంతో 'ఇదేమి ట్రెండ్' అంటూ చర్చనీయాంశంగా మారింది. ఈ టీషర్టు రూ.300 అని, చెన్నైలో వీటికి మంచి డిమాండ్ ఉందంటూ ఆ యువకుడు చెప్పడం గమనార్హం.

- తడ, ఆంధ్రజ్యోతి

ఆయిల్‌పామ్ కంపెనీకి మండలాల కేటాయింపు రద్దు

తిరుపతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ పంట అభివృద్ధి కోసం ఓ కంపెనీకి కేటాయించిన రెండు మండలాలను ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. ఆ కంపెనీ ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన పూర్వాపరాలిలా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్‌ఆన్ ఎడిబుల్‌ఆయిల్స్ (ఆయిల్ పామ్) ప్రోగ్రామ్‌కింద 2021-22 నుంచీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేపడుతోంది. 2021-22నుంచీ 2025-26 వరకూ 1.12 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించింది. రాష్ట్రంలో 4 జిల్లాలకు చెందిన 24 మండలాలను ఎంపిక చేసింది. గతేడాది మార్చిలో తిరుపతి జిల్లాలో నాగలాపురం, నారాయణవనం మండలాలను మెస్సర్స్ ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ అనే కంపెనీకి కేటాయించింది. ఈలోపు 2025-26 సంవత్సరానికి కేంద్రం అదనంగా మరో 50వేల హెక్టార్లు లక్ష్యం విధించింది. అయితే 2025-26లో నారాయణవనం, నాగలాపురం మండలాల పరిధిలో ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ సంస్థ ఆయిల్ పామ్ పంట అభివృద్ధి దిశగా చేసిందేమీ లేదని రాష్ట్ర హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ గుర్తించారు. ఈ విషయాన్ని ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సంస్థకు రెండు మండలాల కేటాయింపును రద్దు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

15 వేల మందికి బియ్యం పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు తీసుకెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. 61,251 మందికిగాను ఈ నెలలో మూడు రోజులుగా 15 వేల మందికి బియ్యం పంపిణీ చేసినట్లు డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

విద్యుత్ ఛార్జీలు వందశాతం వసూలు కావాలి

● ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు వసూళ్ల వంద శాతం చేయాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం గాంధీ రోడ్డులోని ఈఆర్వో కార్యాలయంలో బిల్లుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. యూడీసీ, బిల్ స్టాప్డ్ సర్వీసులను పరిశీలించి.. తొలగించాలన్నారు. పెండింగ్ బకాయిలను వసూలు చేయడంతోపాటు మొండి బకాయిలున్న సర్వీసులను తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతినెలా పదో తేదీలోపు బిల్లులు సర్వ్ చేయాలన్నారు. ఈఈ మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా

● ఎక్సైజ్ డీసీ విజయశేఖర్



ఎన్ఆర్ పేట చెక్‌పోస్టులో సిబ్బందితో మాట్లాడుతున్న విజయశేఖర్

చిత్తూరు సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ తెలిపారు. సోమవారం చిత్తూరు - బెంగళూరు (మురుకంబట్టు బైపాస్ రోడ్డు)లోని శ్రీకృష్ణ డిస్టిలరీస్, పూతలపట్టు సమీపంలోని మద్యం డిపో, ఎన్ఆర్ పేట సమీపంలోని టీడీపీఎల్ డిస్టిలరీస్, ఎన్ఆర్ పేట చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, సారా తయారీ, రవాణా, విక్రయం, వినియోగంపై నిఘా పెట్టామన్నారు. అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సీఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ బాలాజి, వెంకటేశ్వర్లు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ గ్రాడ్యుయేట్లకు నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పించే అంశానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ తదితరులు పాల్గొన్నారు.

'పీ-4'తో గ్రామాభివృద్ధికి తోడ్పాటు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా బలంగా ఉన్న వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అట్టడుగు కుటుంబాలకు చేయూతనిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించే అవకాశాన్ని పీ-4 పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో దీనిపై అధికారులతో సమావేశమయ్యారు. సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. ఎవరినీ బలవంతం చేయడం లేదని, ఇది స్వచ్ఛందమే అని కలెక్టర్ స్పష్టం చేశారు. సీపీవో, డీఈవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ హుండీ ఆదాయం రూ.77.83 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, జూలై 28(ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ హుండీ ద్వారా రూ.77.83 లక్షలు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. 35 రోజులకు సంబంధించి సోమవారం ఆలయంలో హుండీలను లెక్కించగా రూ.77,83,633 నగదు, 21 గ్రాముల బంగారం, 394 గ్రాములు వెండి కొంత విదేశీ కరెన్సీ లభిందన్నారు. రణబేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.57,057 ఆదాయం లభించిందన్నారు. ఈ సొమ్మును స్థానిక గ్రామీణ బ్యాంకులో జమ చేశామని ఆయన పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ, ఆలయ సిబ్బంది, పోలీసులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చల్లా బాబుపై అనుచిత వ్యాఖ్యల పోస్ట్

● పోలీసులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



సీఐ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, చౌడేపల్లె, జూలై28(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిపై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకులు సీవీరెడ్డి, శ్రీకాంత్, పోలీసు గిరి, సుహేల్‌బాషాలు సీఐ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాది వెంకటముని, మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం, ఐటీడీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. చౌడేపల్లిలో ఇదే విషయమై స్థానిక టీడీపీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు టీడీపీ పేరిట ఫేక్ అకౌంట్‌తో పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు సాగర్, రాజారెడ్డి, చంద్రబాబు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ డీడీయూ-జీకేవై ద్వారా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ (సీడాప్) సహకారంతో యువతకు కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగాలకు ఎదురు చూస్తున్న 18-27 ఏళ్ల మధ్య ఉన్నవారికి ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ట్యాలీ, ఐటీ రంగంలో వెబ్ డెవలపర్, టెలికాం బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ రంగాల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజనం, వసతి సదుపాయంతోపాటు మెటీరియల్ అందజేస్తారన్నారు. శిక్షణ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు మెట్రో నగరాల్లోని ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలియజేశారు.

డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయ్!



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్నపిల్లల ఐసీయూ వార్డులో జ్వరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

చిత్తూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 62 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ గణాంకాల్లో చేరనివి చాలా ఎక్కువే ఉంటాయని అంచనా. ఈ ఏడాది ఇప్పటి వరకు మలేరియా 2 కేసులే నమోదు కాగా, డెంగీ బాధితులు అధిక సంఖ్యలో ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

లోపించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్య లోపం బాగా కన్పిస్తోంది. దీనికి వర్షాలు కూడా తోడవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ దోమ తెరలను పంపిణీ

జిల్లాలో ఇప్పటికే 62 కేసుల నమోదు

చేయాల్సి ఉంది.అలాగే స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు పెరగాల్సి వుంది.అలాగే వ్యాధులను నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎపిడమిక్, మలేరియా నివారణ విభాగంలోని సూపర్‌వైజర్లు తరుచూ ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించాలి. అక్కడ నమోదు వుతున్న డెంగ్యూ, మలేరియా, మెదడువాపు కేసుల వివరాలను సేకరించాలి. కానీ ఈ పని సరిగా జరగలేదని తెలుస్తోంది.

దోమల వల్లే...

సాధారణంగా వర్షాలు పడగానే డెంగీ దోమ బెడద మొదలవుతుంది. చిత్తడి , అపరిశుభ్ర వాతావరణమే దీని ఉద్ధృతికి కారణమవుతోంది. సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో చురుగ్గా ఉండే టైగర్ దోమ కుడితే... డెంగీ వైరస్ ఒంట్లో ప్రవేశిస్తుంది.డెంగ్యూ సోకితే శరీరంలో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గుతుంది. మరీ తగ్గితే తప్ప ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు.దీనిపై అవగాహన లేక ఎంతోమంది భయంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, బెడ్ ఛార్జీలు, మందులు కలిపి రూ.20వేలనుంచి 30 వేల దాకా ఖర్చు పెట్టుకుంటున్నారు. అంతకంటే ముందు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా జ్వరాలను నియంత్రించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

ఎలిసా పరీక్ష చేస్తేనే వైద్యశాఖ లెక్కల్లోకి...

డెంగీ జ్వర నిర్ధారణకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్టులు చేస్తున్నారు.నిజానికి ర్యాపిడ్‌టెస్ట్‌లో కచ్చితత్వం ఉండడం లేదని మూడేళ్ల క్రితం ఆ పరీక్ష చేయవద్దని రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాలిచ్చింది.అయినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు ర్యాపిడ్ పరీక్షలకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు.చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే ఎలిసా పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఎలిసా టెస్టు చేసి డెంగీ నిర్ధారణ అయిన కేసులనే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది.అయితే ఎలిసా టెస్టుకు మూడు రోజులు పడుతుండడంతో ఎక్కువమంది రూ. వెయ్యికి పైగా చెల్లించి ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుంటున్నారు.

మందులన్నీ అందుబాటులో వుంచాం



వర్షాకాలం తర్వాత వాతావరణ మార్పులు సర్వసాధారణం. ఈ కారణంగా వైరల్ ఫీవర్లు వస్తున్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన వారికి మందులన్నీ అందుబాటులో వుంచాం.జ్వరం వచ్చిన వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.

\- డీఎంహెచ్‌వో సుధారాణి

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది అధికారికంగా డెంగ్యు కేసులు నమోదయ్యాయని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వ్యాధి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులను ఆదేశించారు. జనావాసాలు అధికంగా వుండే ప్రాంతాలు, వ్యాధులు వెంటనే ప్రబలే ప్రదేశాల్లో నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాలతో కమిటీ ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.మేజర్ పంచాయతీల్లో కనెక్టింగ్ రోడ్ల వద్ద ఉండే చెత్త నిల్వలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వాటిని తొలగించి ప్రజారోగ్య పనులపై దృష్టిపెట్టాలన్నారు. మున్సిపాలిటీల్లో సైతం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. గత రెండు నెలల్లో నమోదైన డెంగ్యూ కేసు వివరాలు తనకు అందించాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. అనంతరం డెంగ్యూ నివారణ మాసం సందర్భంగా గోడపత్రికను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, మలేరియా అధికారి వేణుగోపాల్, డీపీవో సుధాకర రావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులకు పరిహారం మంజూరు



నష్టపరిహారం మంజూరు పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం-శాంతిపురం మండలాల మధ్య ఎయిర్‌పోర్టుకు భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భరోసా ఇచ్చారు. 2018లో సేకరించిన భూములకు సంబంధించి 76మందికి రూ.14కోట్ల మేర నష్టపరిహార మంజూరు పత్రాలను సోమవారం విజలాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భూసేకరణకు సంబంధించి మెరుగైన నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎయిర్‌పోర్టుతో పాటు, భవిష్యత్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో అర్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు విరివిగా గోకులం షెడ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం రాత్రి 7గంటలకు ఆయన విజలాపురంలోని కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, వసతులు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాసులరాజు, తహసీల్దారు కొలేష్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ నాయకులు డా.సురేష్‌బాబు, పట్టనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవంగా ఖననం

● తర్వాత చేరుకున్న మృతుడి కుటుంబసభ్యులు



ఆత్మహత్య చేసుకొన్న బత్తెప్ప



మృతదేహాన్ని ఖననం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



బత్తెప్ప కుటుంబసభ్యులు

పలమనేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అడవిలో ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తిని అనాథగా భావించి ఓ స్వచ్ఛంద సంస్థ అంత్యక్రియలు నిర్వహించింది. విషయం తెలుసుకొని తర్వాత కుటుంబసభ్యులు చేరుకున్నారు. వివరాలివి.. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా ఏకాంబల్లికి చెందిన బత్తెప్ప(67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. ఈక్రమంలో నాలుగు రోజులక్రితం గంగవరం మండలం పత్తికొండ అటవీప్రాంతంలోకి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తిగా భావిం చి గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కోసం ఎవరూ రాకపోవడంతో బత్తెప్ప మృతదేహానికి స్థానిక హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బత్తెప్ప కుటుంబసభ్యులు గుర్తించి సోమవారం పలమనేరు చేరుకున్నారు. అప్పటికే బత్తెప్ప మృతదేహాన్ని ఖన నం చేసిన హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులను కలిశారు. పెద్దమనసుతో అంత్యక్రియలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బత్తెప్ప దశదిన కర్మక్రియలు పలమనేరు శ్మశానవాటికలోనే నిర్వహిస్తామంటూ వారు స్వగ్రామానికి పయనమయ్యారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి



డాక్టర్ నరేంద్ర (ఫైల్ ఫొటో)

తిరుపతి(వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

'స్కిట్'కు పునరుజ్జీవం

● ఈ ఏడాది నుంచే తరగతులు

● ఫలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి



శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం నింపింది. సోమవారం ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాలకు స్థానం కల్పించి అడ్మిషన్లకు ఆహ్వానం పలికారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి ఫలించడంతో ఈ ఏడాది నుంచే ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 1997లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను చేరువ చేయాలని భావించారు. ఆ మేరకు శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. సీట్ల కోసం పెద్దఎత్తున సిఫార్సులు కూడా వచ్చేవి. గత వైసీపీ పాలనలో స్కిట్ కళాశాల పర్యవేక్షణలో విఫలమయ్యారు. దాంతో క్రమంగా విద్యార్థుల చేరిక తగ్గిపోయింది. 2021 డిసెంబరు నెలలో విద్యాసంవత్సరం మధ్యలోనే అర్థాంతరంగా కళాశాలను మూసేశారు. స్కిట్‌ను మూసివేయడం తగదంటూ విద్యార్థులు, యువత ఆందోళన వ్యక్తంచేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ప్రజల అభీష్టం మేరకు గతేడాది ఎన్నికల సందర్భంగా స్కిట్ కళాశాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు పాల్గొన్న బహిరంగ సభలో బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సుధీర్‌రెడ్డి స్కిట్ కళాశాలను తిరిగి ప్రారంభించేందుకు పలుమార్లు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంత్రి చొరవతో స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూతో అనుసంధానం చేయడంపై ఉన్నత స్థాయి అధికారుల కమిటీని నియమించారు. నె ల రోజుల కిందట ఈ ప్రక్రియ పూర్తయింది. క ళాశాలలో తరగతి గదులు ప్రారంభించేందు కు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా స్కిట్ కళాశాలను పొందుపరిచారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్(ఈఈఈ), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్(సీఎస్‌డీ) బ్రాంచ్‌లను అందుబాటులో ఉంచారు. ఒక్కో బ్రాంచ్‌లో 66 సీట్లు కాగా, మొత్తం 396 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఏడాదికి రూ.70వేలు ఫీజును నిర్ణయించారు.



DEPARTMENT OF TECHNICAL EDUCATION

AP EAPCET - 2025 ADMISSIONS

(Admissions into Engineering & Pharmacy Courses - M.P.C. Stream)

Institute-wise Courses offered in Andhra Pradesh

ఇంజనీరింగ్ అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాల

ప్రైవేట్ చేతికి టూరిజం హోటల్

● హరిత ప్రాజెక్టును చేజిక్కించుకున్న 'మృగవాణి'

● గత వైసీపీ హయాంలో జరిగిన టెండరు

● 33 ఏళ్లకు లీజు, ఏడాదికి రూ.కోటి అద్దె

● టెండరు దక్కించుక్ను 22 నెలల తర్వాత మొదలైన పనులు



తిరుపతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరి సమీపంలోని రుయాస్పత్రికి ఎదురుగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చేపట్టిన 103 గదుల హరిత హోటల్ ప్రాజెక్ట్ ఎట్టకేలకు ప్రైవేట్ చేతికి వెళ్లిపోయింది. 2023 అక్టోబరులో వైసీపీ హయాంలో నిర్వహించిన టెండర్లలో తక్కువ అద్దెతో దక్కించుకున్న 'మృగవాణి' రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 22 నెలల తర్వాత సోమవారం పనులు మొదలుపెట్టింది.

తిరుపతిలో ఓ స్టార్ హోటల్ కట్టాలని ఏపీటీడీసీ నిర్ణయించింది. దీంతో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తిరుమలకు వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని రూ.17 కోట్ల బడ్జెట్‌తో హరిత హోటల్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇందులో రూ.7 కోట్లను విడుదల చేయడంతో నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. 1.03 ఎకరాల విస్తీర్ణంలో తొలిదశలోనే భవన నిర్మాణపు సివిల్ వర్క్ దాదాపు పూర్తయిపోయింది. ఇంతలో అధికారుల అలసత్వమో, రాజకీయ కారణమో తెలియదుకానీ హరిత హోటల్ ప్రాజెక్టు ముందుకు కదలలేకపోయింది. ఈక్రమంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇవ్వాలని 2020 ఆగస్టు 27న ఈ-టెండర్ నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్ ఏడాదికి రూ1.53కోట్లతో టెండర్ దక్కించుకుంది. ఏడాదికి 5 శాతం పెంచుకుంటూ 33 సంవత్సరాల పాటు హోటల్‌ను నిర్వహించుకోవచ్చని చెప్పింది. కారణాలేమోగాని వారు ముందుకు రాలేదు. ఆతర్వాత అద్దె ధర తగ్గించుకుంటూ ఏడాదికి రూ.కోటి అద్దెకు కుదించి 2023లో టెండరు పిలిచారు. పలుచోట్ల రిసార్ట్సు, హోటల్స్ కలిగిన మృగవాణి సంస్థ చేజిక్కించుకుంది.

ప్రైవేట్ పరంపై విమర్శలు

అలిపిరి సమీపంలోని విశాలమైన స్థలంలో హరిత హోటల్ కోసం నిర్మించిన 5 అంతస్థుల భవనంలో 103 గదులు, 200 మంది కూర్చునేలా రెస్టారెంట్, 3 కాన్ఫరెన్స్ హాళ్లు, ఒక ఫంక్షన్ హాల్, డార్మిటరీ అకామడేషన్, 100 కార్లు నిలిపే సదుపాయాలున్నాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన అలిపిరి సమీపంలో నెలకు రూ8.3లక్షల అద్దెకోసం ఐదంతస్థుల విశాలమైన భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరుచానూరు సమీపంలో టీటీడీ నిర్మించిన పద్మావతి నిలయాన్ని (ప్రస్తుత కలెక్టరేట్) ఏపీటీడీసీ ఏడాదికి కోటి రూపాయల అద్దెతో తీసుకుంది. అదే టూరిజం విభాగం తనకున్న భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అదే అద్దెకు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. ఇదిలా ఉంటే వైసీపీ హయాంలో దక్కించుకున్న టెండరు కాలపరిమితి ముగిసిన తర్వాత పనులు మొదలు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్


విజేతలకు మెమెంటో అందజేస్తున్న అప్పు ముఖేశ్ తదితరులు

కుప్పం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో కొత్తపేట టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని రూ.22 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టోర్నమెంట్ విజేత బెంగళూరు జేఆర్బీ క్రికెట్ జట్టుకు రూ.50,001 నగదు బహుమతిని, టోర్నమెంట్ కప్‌ను కొత్తపేట యువ నాయకుడు రాహుల్ కుమార్ అందజేశారు. రన్నర్‌ఎగా నిలిచిన గ్రైతమ్ చెన్నై జట్టుకు రూ.30 వేల నగదు బహుమతిని, కప్‌ను కొత్తపేట తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ప్రదానం చేశారు. మూడో స్థానంలో నిలిచిన డేంజర్ బాయ్ జట్టుకు తృతీయ బహుమతిగా రూ.15 వేల నగదును బిరుదనపల్లెకు చెందిన యువ నాయకుడు జేకే.సంతోశ్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.గోపీనాథ్, నాయకులు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, సెల్వరాజ్, వీజీ.ప్రతాప్, చెక్కునత్తం మణి, జేకే.సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లకు ఓపెన్ స్కూల్ అవకాశం


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

రొంపిచెర్ల,జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటర్ మీడియట్, పదవ తరగతిలోపు చదువుతూ మానేసిన విద్యార్థులకు(డ్రాపౌట్లు) ప్రభుత్వం ఓపెన్ స్కూలు అవకాశం కల్పించిదని జిల్లా సమగ్రశిక్షా సీఎంవో మధు అన్నారు. రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ తరగతులకు దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యలో చదువు ఆపేసిన పేద పిల్లలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.ధనలక్ష్మి, సజాత, రెడ్డీరమేష్, సీఆర్‌సీలు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన కరపత్రాల పంపిణీ


కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పలమనేరు, జూలై28 (ఆంధ్రజ్యోతి: మొరం గ్రామంలో సోమవారం మండల తెలుగుయువత అధ్యక్షులు వెంకటముని రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టారు. నాయకులు కవీంద్రనాయుడు, పూర్ణచంద్రనాయుడు, అనిల్, విశ్వనాథరెడ్డి,మంజునాథరెడ్డి,నాగరాజు,ఏకాంబరం నాయుడు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఉన్నతికి సహకరించాలి


మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూలై28 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల ఉన్నతికి అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి కోరారు. సోమవారం స్థానిక దుకాణదారులు, వ్యాపారస్థులు, మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కొందరు వర్తకులు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు కొన్ని కుటుంబాలను దత్తత తీసుకొనడంపై ఆసక్తి చూపారు. మున్సిపాలిటీ పరిధిలో 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధానికికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, డీఈ బి.సురేంద్రబాబు, స్నేహప్రియ, టీపీఎస్ ఇందిర, బాబా తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి పనులపై ఆరా


ఎంపీడీవోతో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సోమవారం సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ పార్వతీలను టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి కలిసి అభివృద్ధి పనులపై ఆరా తీశార. పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బందితో గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని కోరారు. టీడీపీ నాయకులు అమీద్‌ఖాన్, చంద్రమౌళి, రమణ, రెడ్డప్ప, చిన్నికిశోర్, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన లలిత

పలమనేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమంగళం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. కేటిల్ ఫారం వైపు నుంచి పలమనేరుకు రెడ్డెప్ప, నీలమ్మ, లలిత అనే వ్యక్తులు మోటరు సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ 108 సిబ్బంది పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి): బల్ల పంచాయతీ పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయ అభివృద్ధికి టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి రూ.25వేలు, ఎంపీపీ సులోచనగుర్రప్ప దంపతులు రూ.10వేల చొప్పున విరాళాలు అందించారు. సోమవారం వారు ఆలయాన్ని సందర్శించారు. విరాళాల మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారిలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీవైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, వన్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టరు భూపతి, నేతలు నందారెడ్డి, పెరుమాళ్, వెంకటరమణ, మంజునాథరెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

పలమనేరు, జూలై28 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని ఎంపీడీవో భాస్కర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ పంచాయితీల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ మల్లిక, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


నంద్యాలలో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న పుంగనూరు బీజేపీ నాయకుడు నానబాల కుమార్

భవన నిర్మాణ కార్మికుల నిరసన



పుంగనూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు కేశవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గత ప్రభుత్వం విడుదల చేసిన 1214 జీవోను రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 46వేల పెండింగ్ క్లైములను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. 50 ఏళ్లు నిండిన భవన కార్మికులకు రూ. 6వేలు పింఛన్ మంజూరు చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ రాముకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్

పుంగనూరు రూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం పట్టణంలోని తపాల కార్యాలయం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సింగిరిగుంట పంచాయతీ అరవపల్లెకు చెందిన నారాయణప్ప కుమారుడు రాజేష్(26) తీవ్రంగా గాయడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించండి

గ్రీవెన్స్‌డేలో ఆర్డీవో ఆదేశం


అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో భవానీ

పలమనేరు, జూలై28 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో భవానీ ఆదేశించారు. సోమవారం తమ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో అర్జీలను స్వీకరించారు. . రైతుల సమస్యలను తెలుసుకొని సంబంధిత తహసిల్దార్‌లకు ఫోన్‌చేసి పరిష్కరించాలని సూచించారు. పదే పదే పనులు వదులుకొని వచ్చి తమ రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇస్తున్నా పరిష్కారం కావడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

●నా భూమి వన్‌బీ కోసం రెండేళ్ళుగా తిరుగుతున్నాను. రెండు పర్యాయాలు కలెక్టర్ గ్రీవెన్స్‌డేలో అర్జీలు ఇచ్చాను. అక్కడ వీఆర్‌ఓను కలవాలన్నారు. వీఆర్‌ఓను కలిస్తే తహసిల్దార్‌ను కలవాలన్నారు. ఆరునెలలుగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదు.

-రియాజ్, నదుం

● నాకు రెండు సర్వే నంబర్లలో 1.63 ఎకరాల భూమి ఉంది. కానీ ఈభూమిని మరొకరి పేరు మీద రికార్డుల్లో నమోదు చేశారు. 2011లో మదనపల్లి ఆర్డీఓ కోర్టులో కేసు వేశాను. ఇప్పటికీ పలమనేరుకు బదిలీ కాలేదు. 8సార్లుగా తిరుగుతూనే ఉన్నాను. ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిన్నందున నడవలేక ఇబ్బంది పడుతున్నాను.

-అశోక్‌కుమార్,ఈడిగపల్లి

●నా తండ్రి నుంచి సంక్రమించిన 2.37 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు రికార్డుల్లో మరొకరి పేరున మార్చేశారు. సదరు వ్యక్తి ఆభూమిని మరొకరికి విక్రయించేశారు. కలెక్టర్ గ్రీవెన్స్‌డేలో అర్జీ ఇవ్వగా ఆర్డీవోను కలవమన్నారు. మూడు నెలలుగా తిరుగుతున్నాను.

-రమణ, తాతిరెడ్డిపల్లి

డిసెంబరుకు క్రెమిటోరియం నిర్మాణం పూర్తి


క్రెమిటోరియం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, వికాస్ మర్మత్ తదితరులు

కుప్పం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన శ్మశాన వాటికలో ఎల్పీజీ క్రెమిటోరియం నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడా సలహా మండలి సభ్యుడు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ శ్మశాన వాటికలో రూ.3 కోట్లతో క్రెమిటోరియాన్ని నిర్మిస్తున్నామన్నారు. డిసెంబరుకల్లా ఈ నిర్మాణం పూర్తవతుందని చెప్పారు. ఇటీవలే పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి పనులను రూ.22 కోట్లతో ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండు వద్ద సెంట్రల్ పార్కు అభివృద్ధికి మరో రూ.10 కోట్లు కేటాయించామన్నారు. రెండేళ్లలో నియోజకవర్గం, ప్రత్యేకించి కుప్పం మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధిని సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో నియోజకవర్గం స్వర్గధామంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు కన్నన్, సత్యేంద్రశేఖర్, నాను, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోలాహలంగా కావిళ్ల సమర్పణ


ముద్దనపల్లె నుంచి వీపుతేరు లాక్కుని వస్తున్న భక్తుడు

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు కావిళ్ళు మోసుకుంటూ, వీపు తేర్లు లాగుతూ ఆలయానికి చేరుకున్నారు. కావళ్ళు, తేర్లు స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వహకులు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

మేలుపట్ల చెరువు ఆక్రమణలను తొలగించాలి


తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): మేలుపట్ల చెరువు ఆక్రమణలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు కోరారు. సోమవారం తహసీల్దార్ రాముకు వారు ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల విలువలు పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములను కొనుగోలు చేసి పక్కన ప్రభుత్వ భూములు, వంకలు, చెరువులను కలిపేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ, చెరువులు, వంకలు కాపాడాలని మాజీ కౌన్సిలర్ కృపాకర్ తదితరులు కోరారు.

అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి కృషి


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి):కొంగనపల్లె పంచాయతీ కొళ్ళపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనాన్ని నిర్మిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సొంతభవనం లేక అద్దె భవనంలో కేంద్రం కొనసాగుతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే సొంత భవన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.

క్వారీలతో ఇబ్బందులపై తహసీల్దారుకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అవినీతి నిర్మూలనా సంస్థ నాయకులు, గ్రామస్థులు

బైరెడ్డిపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గడ్డూరు సమీపంలో నిర్వహిస్తున్న క్వారీలను నిలిపివేయాలని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలనా సంస్థ జిల్లా అధ్యక్షుడు మునిరత్నం, ఉపాధ్యక్షురాలు విజయమ్మ డిమాండ్ చేశారు. సోమవారం వారు క్వారీని పరిశీలించారు. క్వారీలో తరచూ జరిగే పేలుళ్ల వల్ల తమ ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని గ్రామస్థులు వారికి చెప్పారు. బండలు కొట్టి జీవనం సాగించే దాదాపు 15 కుటుంబాలు జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చిందన్నారు. క్వారీ పనుల కారణంగా పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు.

పేద కుటుంబాల ప్రగతికి పాటుపడదాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో హరిబాబు

సదుం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు భాగస్వామ్యులు కావాలని ఎంపీడీవో హరిబాబు కోరారు. ఆయన అధ్యక్షతన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సాధారణ సమావేశం జరిగింది. పీ-4 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఎంపీడీవో చెప్పారు.ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి తెలియజేశారు.. ఎంఈవో-2 దామోదర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబంలోని విద్యార్థులకు తల్లికి వందనం పథకం అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస నాయుడు, వైఎస్-ఎంపీపీ ధనుంజయరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్రావణ మాస పూజలు


విశేష అలంకరణలో అన్నపూర్ణదేవి కాశీవిశ్వేశ్వరస్వామి

రొంపిచెర్ల,జూలై 28 (ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని శివాలయంలో సోమవారం శ్రావణ మాస పూజలు జరిగాయి. శివలింగానికి అన్నాభిషేకం, రుద్రభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా వారణాశివారిపల్లెకు చెందిన శ్రీనువాసులు దంపతులు వ్యవహరించారు.

సోమల: సోమల స్వయంభేశ్వరస్వామి, దుర్గంకొండ గార్గేయ మునీశ్వరస్వామి, మల్లేశ్వరపురం మల్లేశ్వరస్వామి, ఇరికిపెంట పంచాయతీ మధురమలై కొండలోని నేలమల్లేశ్వరస్వామి తదితర ఆలయాల అభిషేకాల్లో భక్తులు పాల్గొన్నారు.

రామకుప్పం: పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. భక్తులు దర్శించుకుని, అర్చనలు చేయించారు.

ఘనంగా అర్జున తపస్మాన్

సోమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా సోమవారం అర్జున తపస్మాన్ ఘట్టం కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత పాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో తపస్మాన్‌కు పూజలు చేశారు. అర్జున వేషధారి తపస్మాన్‌ను అధిరోహిస్తూ పద్యాలను ఆలపించారు. ఇందులో కానుకల కోసం భక్తులు ఉపవాస దీక్షలతో నిరీక్షించారు. భాగవతారణి గీతాశ్రీ అర్జున తపస్మాన్ ఘట్టాన్ని రమ్యంగా ఆలపించారు.

ఉచిత వైద్యసేవలు



బైరెడ్డిపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రామసముద్రంలో సోమవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగం గురించి అవగాహన కల్పించారు. కాంతమ్మ, తిరుమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సదుంలో కురబ కులస్తుల సమావేశం

సదుం, జూలై 28(ఆంధ్రజ్యోతి): కనకదాసు విగ్రహ ఏర్పాటుపై చర్చించేందుకు స్థానిక వారపు సంతలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు దాసశ్రేష్ఠ భక్త కనకదాసు విగ్రహ సాధన కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. సమావేశానికి బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత హాజరవుతారని వారు తెలిపారు.

అర్జీల స్వీకారం

సోమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో. సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరించారు. అర్జీలపై తహసీల్దార్ మధుసూదన్‌వీఆర్వోలతో సమీక్షించారు. వినతుల పరిష్కారంలో చొరవ తీసుకోవాలన్నారు.

డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయ్!

చిత్తూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 62 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ గణాంకాల్లో చేరనివి చాలా ఎక్కువే ఉంటాయని అంచనా. ఈ ఏడాది ఇప్పటి వరకు మలేరియా 2 కేసులే నమోదు కాగా, డెంగీ బాధితులు అధిక సంఖ్యలో ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

లోపించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్య లోపం బాగా కన్పిస్తోంది. దీనికి వర్షాలు కూడా తోడవడంతో వ్యాధులు ప్రబలు తున్నాయి. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ దోమ తెరలను పంపిణీ

జిల్లాలో ఇప్పటికే 62 కేసుల నమోదు

చేయాల్సి ఉంది.అలాగే స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు పెరగాల్సి వుంది.అలాగే వ్యాధులను నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎపిడమిక్, మలేరియా నివారణ విభాగంలోని సూపర్‌వైజర్లు తరుచూ ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించాలి. అక్కడ నమోదువుతున్న డెంగ్యూ, మలేరియా, మెదడువాపు కేసుల వివరాలను సేకరించాలి. కానీ ఈ పని సరిగా జరగలేదని తెలుస్తోంది.

దోమల వల్లే...

సాధారణంగా వర్షాలు పడగానే డెంగీ దోమ బెడద మొదలవుతుంది. చిత్తడి , అపరిశుభ్ర వాతావరణమే దీని ఉద్భృతికి కారణమవుతోంది. సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో చురుగ్గా ఉండే టైగర్ దోమ కుడితే... డెంగీ వైరస్ ఒంట్లో ప్రవేశిస్తుంది.డెంగ్యూ సోకితే శరీరంలో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గుతుంది. మరీ తగ్గితే తప్ప ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు.దీనిపై అవగాహన లేక ఎంతోమంది భయంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, బెడ్ ఛార్జీలు, మందులు కలిపి రూ.20వేలనుంచి 30 వేల దాకా ఖర్చు పెట్టుకుంటున్నారు. అంతకంటే ముందు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా జ్వరాలను నియంత్రించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్నపిల్లల ఐసీయూ వార్డులో జ్వరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఎలిసా పరీక్ష చేస్తేనే వైద్యశాఖ లెక్కల్లోకి...

డెంగీ జ్వర నిర్ధారణకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్టులు చేస్తున్నారు.నిజానికి ర్యాపిడ్‌టెస్ట్‌లో కచ్చితత్వం ఉండడం లేదని మూడేళ్ల క్రితం ఆ పరీక్ష చేయవద్దని రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాలిచ్చింది.అయినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు ర్యాపిడ్ పరీక్షలకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు.చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే ఎలిసా పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఎలిసా టెస్టు చేసి డెంగీ నిర్ధారణ అయిన కేసులనే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది.అయితే ఎలిసా టెస్టుకు మూడు రోజులు పడుతుండడంతో ఎక్కువమంది రూ. వెయ్యికి పైగా చెల్లించి ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుంటున్నారు.

మందులన్నీ అందుబాటులో వుంచాం



వర్షాకాలం తర్వాత వాతావరణ మార్పులు సర్వసాధారణం. ఈ కారణంగా వైరల్ ఫీవర్లు వస్తున్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన వారికి మందులన్నీ అందుబాటులో వుంచాం.జ్వరం వచ్చిన వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.

- డీఎంహెచ్‌వో సుధారాణి

విద్యుత్ ఛార్జీలు వందశాతం వసూలు కావాలి

● ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు వసూళ్లు వంద శాతం చేయాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం గాంధీ రోడ్డులోని ఈఆర్వో కార్యాలయంలో బిల్లుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. యూడీసీ, బిల్ స్టాప్డ్ సర్వీసులను పరిశీలించి.. తొలగించాలన్నారు. పెండింగ్ బకాయిలను వసూలు చేయడంతోపాటు మొండి బకాయిలున్న సర్వీసులను తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతినెలా పదో తేదీలోపు బిల్లులు సర్వే చేయాలన్నారు. ఈఈ మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా

● ఎక్సైజ్ డీసీ విజయశేఖర్



ఎస్ఆర్ పేట చెక్‌పోస్టులో సిబ్బందితో మాట్లాడుతున్న విజయశేఖర్

చిత్తూరు సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ తెలిపారు. సోమవారం చిత్తూరు - బెంగళూరు (మురుకంబట్టు బైపాస్ రోడ్డు)లోని శ్రీకృష్ణ డిస్టిలరీస్, పూతలపట్టు సమీపంలోని మద్యం డిపో, ఎస్ఆర్ పేట సమీపంలోని టీడీపీఎల్ డిస్టిలరీస్, ఎస్ఆర్ పేట చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, సారా తయారీ, రవాణా, విక్రయం, వినియోగంపై నిఘా పెట్టామన్నారు. అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సీఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ బాలాజి, వెంకటేశ్వర్లు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది అధికారికంగా డెంగ్యు కేసులు నమోదయ్యాయని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వ్యాధి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులను ఆదేశించారు. జనావాసాలు అధికంగా వుండే ప్రాంతాలు, వ్యాధులు వెంటనే ప్రబలే ప్రదేశాల్లో నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాలతో కమిటీ ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.మేజర్ పంచాయతీల్లో కనెక్టింగ్ రోడ్ల వద్ద ఉండే చెత్త నిల్వలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వాటిని తొలగించి ప్రజారోగ్య పనులపై దృష్టిపెట్టాలన్నారు. మున్సిపాలిటీల్లో సైతం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. గత రెండు నెలల్లో నమోదైన డెంగ్యూ కేసు వివరాలు తనకు అందించాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. అనంతరం డెంగ్యూ నివారణ మాసం సందర్భంగా గోడపత్రికను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, మలేరియా అధికారి వేణుగోపాల్, డీపీవో సుధాకర రావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులకు పరిహారం మంజూరు



నష్టపరిహారం మంజూరు పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్

రామకుప్పం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం-శాంతిపురం మండలాల మధ్య ఎయిర్‌పోర్టుకు భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భరోసా ఇచ్చారు. 2018లో సేకరించిన భూములకు సంబంధించి 76మందికి రూ.14కోట్ల మేర నష్టపరిహార మంజూరు పత్రాలను సోమవారం విజలాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భూసేకరణకు సంబంధించి మెరుగైన నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎయిర్‌పోర్టుతో పాటు, భవిష్యత్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో అర్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు విరివిగా గోకులం షెడ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం రాత్రి 7గంటలకు ఆయన విజలాపురంలోని కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, వసతులు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాసులరాజు, తహసీల్దారు కౌలేష్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ నాయకులు డా.సురేష్‌బాబు, పట్రనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి



డాక్టర్ నరేంద్ర (ఫైల్ ఫొటో)

తిరుపతి(వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ గ్రాడ్యుయేట్లకు నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పించే అంశానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ తదితరులు పాల్గొన్నారు.

'పీ-4'తో గ్రామాభివృద్ధికి తోడ్పాటు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా బలంగా ఉన్న వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అట్టడుగు కుటుంబాలకు చేయూతనిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించే అవకాశాన్ని పీ-4 పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో దీనిపై అధికారులతో సమావేశమయ్యారు. సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. ఎవరినీ బలవంతం చేయడం లేదని, ఇది స్వచ్ఛందమే అని కలెక్టర్ స్పష్టం చేశారు. సీపీవో, డీఈవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ హుండీ ఆదాయం రూ.77.83 లక్షలు

చౌడేపల్లె, జూలై 28(ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ హుండీ ద్వారా రూ.77.83 లక్షలు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. 35 రోజులకు సంబంధించి సోమవారం ఆలయంలో హుండీలను లెక్కించగా రూ.77,83,633 నగదు, 21 గ్రాముల బంగారం, 394 గ్రాములు వెండి కొంత విదేశీ కరెన్సీ లభిందన్నారు. రణబేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.57,057 ఆదాయం లభించిందన్నారు. ఈ సొమ్మును స్థానిక గ్రామీణ బ్యాంకులో జమ చేశామని ఆయన పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ, ఆలయ సిబ్బంది, పోలీసులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవంగా ఖననం

● తర్వాత చేరుకున్న మృతుడి కుటుంబసభ్యులు



ఆత్మహత్య చేసుకొన్న బత్తెప్ప



మృతదేహాన్ని ఖననం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు



బత్తెప్ప కుటుంబసభ్యులు

పలమనేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అడవిలో ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తిని అనాథగా భావించి ఓ స్వచ్ఛంద సంస్థ అంత్యక్రియలు నిర్వహించింది. విషయం తెలుసుకొని తర్వాత కుటుంబసభ్యులు చేరుకున్నారు. వివరాలివి.. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా ఏకాంబల్లికి చెందిన బత్తెప్ప(67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. ఈక్రమంలో నాలుగు రోజులక్రితం గంగవరం మండలం పత్తికొండ అటవీప్రాంతంలోకి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తిగా భావిం చి గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కోసం ఎవరూ రాకపోవడంతో బత్తెప్ప మృతదేహానికి స్థానిక హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బత్తెప్ప కుటుంబసభ్యులు గుర్తించి సోమవారం పలమనేరు చేరుకున్నారు. అప్పటికే బత్తెప్ప మృతదేహాన్ని ఖన నం చేసిన హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులను కలిశారు. పెద్దమనసుతో అంత్యక్రియలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బత్తెప్ప దశదిన కర్మక్రియలు పలమనేరు శ్మశానవాటికలోనే నిర్వహిస్తామంటూ వారు స్వగ్రామానికి పయనమయ్యారు.

సమస్యలివిగో.. పరిష్కరించండి

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 289 అర్జీలు

చిత్తూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మొత్తం 289 అర్జీలను అందజేశారు. వీటిల్లో రెవెన్యూశాఖకే అత్యధికంగా 251 అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏ శాఖకు 31, పౌరసరఫరా, పోలీసు శాఖలకు రెండు చొప్పున, జిల్లా కారాగారానికి, పంచాయతీరాజ్, వయోవృద్ధుల సంక్షేమశాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలున్నాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు అర్జీలను తీసుకున్నారు. పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రధాన అర్జీలిలా ఉన్నాయి.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కనే జేసీ విద్యాధరి తదితరులు



శ్మశాన భూమిని ఆక్రమించారు

జొన్నకొప్పులబావి కింద ఉన్న పిల్లవంకలోని శ్మశాన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని ఐరాల మండలంలోని గోవిందరెడ్డిపల్లె యానాదికాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని చెప్పారు.

సొంతింటి నిర్మాణానికి సాయం చేయండి

బాడుగ ఇంట్లో 11 ఏళ్లుగా ఉన్న తనకు సొంతింటి నిర్మాణానికి సాయం చేయాలని గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురానికి చెందిన మంజునాథన్ కోరారు. తన వందశాతం అంగవైకల్యం ఉండటంతో ఏ పనీ చేయలేక ప్రభుత్వం ఇచ్చే పింఛనుతో ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నానని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటిని కట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధాప్య పింఛను మంజూరు చేయండి

తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన పూజారి రవీంద్రసింగ్(63) కోరారు. కుటుంబీకులు ఎవరిదారిన వారు వెళ్లిపోవడంతో తనకు జీవనం కష్టంగా మారిందని వాపోయాడు.

ఇళ్లకు అనుభవపట్టాలివ్వాలి

తాము నివాసముంటున్న ఇళ్లకు అనుభవ పట్టాలను ఇవ్వాలని పూతలపట్టు మండలం క్షీరసాగరం యానాదులు కోరారు. ప్రభుత్వ స్థలంలో 2000వ సంవత్సరంలో 40 కుటుంబాలకు చెందిన తాము ఇళ్లను కట్టుకుని ఉంటున్నామన్నారు.





రోడ్డును ఏర్పాటు చేయండి

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని ఐరాల మండలం ఎర్రేపల్లె పంచాయతీలోని అబ్బుగుండు గ్రామస్తులు కోరారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ కూడా రావడం లేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తారు రోడ్డును వేయాలన్నారు.

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం: ఎస్పీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మణికంఠ

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్పీ మణికంఠ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిప పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని నిర్ణీత సమయంలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 36 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 13, డబ్బు తగాదాలపై 7, ఆస్తి తగాదాలపై 4, చీటింగ్‌పై 3, కుటుంబ తగాదాలపై 3, హత్యాప్రయత్నంపై 2, వేధింపులపై 2, దారి సమస్యపై 1, బెదిరింపులపై ఒకటి చొప్పున అర్జీలున్నాయి.

'స్కిట్'కు పునరుజ్జీవం

● ఈ ఏడాది నుంచే తరగతులు



శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం నింపింది. సోమవారం ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాలకు స్థానం కల్పించి అడ్మిషన్లకు ఆహ్వానం పలికారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి ఫలించడంతో ఈ ఏడాది నుంచే ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి. 1997లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను చేరువ చేయాలని భావించారు. ఆ మేరకు శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. సీట్ల కోసం పెద్దఎత్తున సిఫార్సులు కూడా వచ్చేవి. గత వైసీపీ పాలనలో స్కిట్ కళాశాల పర్యవేక్షణలో విఫలమయ్యారు. దాంతో క్రమంగా విద్యార్థుల చేరిక తగ్గిపోయింది. 2021 డిసెంబరు నెలలో విద్యాసంవత్సరం మధ్యలోనే అర్ధాంతరంగా కళాశాలను మూసేశారు. స్కిట్‌ను మూసివేయడం తగదంటూ విద్యార్థులు, యువత ఆందోళన వ్యక్తంచేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ప్రజల అభీష్టం మేరకు గతేడాది ఎన్నికల సందర్భంగా స్కిట్ కళాశాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు పాల్గొన్న బహిరంగ సభలో బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సుధీర్‌రెడ్డి స్కిట్ కళాశాలను తిరిగి ప్రారంభించేందుకు పలుమార్లు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంత్రి చొరవతో స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూతో అనుసంధానం చేయడంపై ఉన్నత స్థాయి అధికారుల కమిటీని నియమించారు. నె ల రోజుల కిందట ఈ ప్రక్రియ పూర్తయింది. క ళాశాలలో తరగతి గదులు ప్రారంభించేందు కు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా స్కిట్ కళాశాలను పొందుపరిచారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్(ఈఈఈ), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్(సీఎస్‌డీ) బ్రాంచ్‌లను అందుబాటులో ఉంచారు. ఒక్కో బ్రాంచ్‌లో 66 సీట్లు కాగా, మొత్తం 396 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఏడాదికి రూ.70వేలు ఫీజును నిర్ణయించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ డీడీయూ-జీకేవై ద్వారా రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ సంస్థ (సీడాప్) సహకారంతో యువతకు కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగాలకు ఎదురుచూస్తున్న 18-27 ఏళ్ల మధ్య ఉన్నవారికి ఎంఎస్ ఆఫీస్, వర్డ్, ట్యాలీ, ఐటీ రంగంలో వెబ్ డెవలపర్, టెలికాం బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ రంగాల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజనం, వసతి సదుపాయంతోపాటు మెటీరియల్ అందజేస్తారన్నారు. శిక్షణ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు మెట్రో నగరాల్లోని ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన అలిపిరి పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత వివరాల మేరకు.. విజయపురం మండలం మిట్టకండిగకు చెందిన కృష్ణయ్య(55) తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కపిలతీర్థం సమీపంలోని ఆర్చి వద్ద తిరుపతి అటవీ శాఖ రేంజర్ చలపతి చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులకు వెళుతున్నాడు. గోడలకు నీరు పట్టి బోరు ఆపే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలసముద్రం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం కాలనీలో పీఎంఏజీవై పథకం ద్వారా కొత్తగా తాగునీటి బోరు వేసి సోమవారం మోటరును అమర్చి నీళ్లు వదిలారు. ఏడాదిగా కాలనీలో తాగునీటి సమస్య నెలకొని ఉంది. ఇక్కడ మూడు తాగునీటి బోర్లు ఉన్నా భూగర్భ జల మట్టం తగ్గి పోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. కాలనీకి పీఎంఏజీవై పథకం ద్వారా నిధులు మంజూరవడంతో ఎంపీడీవో సతీష్, సర్పంచ్ అయ్యప్పలు కొత్త బోరు వేయించారు. బోరులో సమృద్ధిగా నీళ్లు రావడంతో తాగునీటి కష్టాలు తీరాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.


కొత్తగా వేసిన తాగునీటి బోరు నుంచి వస్తున్న నీరు

కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన : టీడీపీ

నింద్ర, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన సాధ్యమని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర నాయుడు అన్నారు. సోమవారం కీళంబాకం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ నరసింహులు, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, రాజేంద్రరాజు, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.


స్థానికులకు కరపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వరనాయుడు

షుగర్ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి

ఐరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని, నిత్యం వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఐరాల పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్ప సూచించారు. సోమవారం ఆయన వేదగిరి వారిపల్లెలో ఎఫ్‌డీపీ (ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్) నిర్వహించారు. సీహెచ్‌వో ఆదిలక్ష్మి, ఎంపీహెచ్ఏ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్డెప్ప

నగరి పీఏసీఎస్ సీఈవోకు సన్మానం

నగరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాబార్డు కార్యాలయంలో అవార్డు తీసుకున్న నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్లైను రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి సోమవారం సన్మానించారు. పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణాపురం గ్రామ రైతులు పాల్గొన్నారు.



'అబాకస్'లో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ

యాదమరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఈనెల 26వ తేదీన విజయవాడలో జరిగిన అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపారు. 5వ తరగతి ఎస్.భార్గవ్ సాయి చాంపియన్‌షిప్‌ను, 8వ తరగతి కె.కార్తిక్ సాయి మూడో రన్నరప్‌గా, పెర్షిత శివాని, పి.వి. కార్తిక్, దీక్షిత, సహిష్ణు, మోక్షజ్ఞ, ఎస్. మోహిత్, విఘ్నేష్ చౌదరి, విఘ్నేశ్ బెస్ట్ పెర్ఫార్మర్స్‌గా చోటు దక్కించుకున్నారని ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు తెలిపారు. విద్యార్థులను, శిక్షకురాలు శ్రీలతను ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు.



నృత్య పోటీల్లో 'విజయం' ప్రతిభ


తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు నుంచి జ్ఞాపిక అందుకున్న విద్యార్థినులు

చిత్తూరు సెంట్రల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య పోటీల్లో స్థానిక విజయం సీబీఎస్ఈ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ద్వితీయ ఇంటర్ విద్యార్థులు ఎ.జయశ్రీ, ఆర్.తులసి, ఎ.యోషిని ప్రియ, సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థిని ఎం.ద్రితికి నృత్య పోటీల్లో బహుమతులు వచ్చాయన్నారు. వీరు తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు నుంచి జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు. సోమవారం విద్యార్థినులకు విజయం అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, హెచ్ఎం అఖిల రమేష్, టీచర్లు అభినందించారు.

ఆలయ భూములను కాపాడండి

పూతలపట్టు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములు కాపాడాలని వైసీపీ రాష్ట్ర మేధావుల సంఘం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌ను కలిసి విన్నవించారు. పూతలపట్టులోని శ్రీరాముల స్వామివారి గుడికి పూర్వీకులు 571/2 సర్వేనెంబరులో 33 సెంట్ల భూమిని గుడిపేరుతో 1962లో పాకాల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. సర్పంచ్ మాసలామణి, ఆలయ ధర్మకర్త మల్లికార్జున శెట్టి, కోఆప్షన్‌మెంబర్ ఖాదర్‌వలి,బాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

గుడిపాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా ప్రభుత్వానికి సంబంధించిన భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా కొంతమంది చెరువులను, వంకను ఆక్రమించుకుని పంటసాగు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి, చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాణిపాకం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ఐరాల(కాణిపాకం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఎస్ఐగా నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తన సహకారాన్ని అందిస్తానన్నారు. ఐరాల నుంచి బదిలీపై కాణిపాకం వచ్చానని చెప్పారు.


నరసింహులు

నేటినుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

వెదురుకుప్పం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

నగరంలో బీటీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు ఆమోదం

చిత్తూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం మేయర్ అముద అధ్యక్షతన జరిగింది. కమిషనర్ నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సభ్యులు నిర్మల, శశికుమార్, సుష్మా, అశోక్ పాల్గొన్నారు. అజెండా, టేబుల్ అజెండా అంశాలపై చర్చించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో బీటీ రోడ్లు, కాలువలు, నిర్దేశించిన ప్రాంతాల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణానికి పిలిచిన టెండర్లకు ఎల్‌వోసీ జారీ, నిధుల వ్యయం చేయడానికి ఆమోదించారు. వెంగళరావుకాలనీలో నీటి ప్రవాహానికి సంబంధించి శాశ్వత పరిష్కారంలో భాగంగా మేజర్ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, ఏఆర్వీ టీకాలు వేయడానికి అవసరమైన యంత్ర సామగ్రి, మందుల కొనుగోలుకు, ఇటీవల మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియాకు ఆమోదించారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన సభ్యులు

4న గుడిపాల సింగిల్‌విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం

గుడిపాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గుడిపాల సింగిల్‌విండో చైర్మన్‌గా దేవపత్ని ప్రతాప్ నాయుడు, డైరెక్టర్లుగా హరి, సెల్వినాధన్‌లను నియమించారు. ఆగస్టు 4వతేదీన ప్రమాణ స్వీకారం చేయడానికి 'విండో' కార్యాలయం ముందున్న ఖాళీ స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ప్రతాప్‌నాయుడు, హరి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, ఎంపీటీసీ గోళ్లహరిప్రసాద్ చౌదరి, నాయకులు బాలసుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్‌చౌదరి, చెందు, భాస్కర్, ప్రదీప్, సింధురాయల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పేదలకు ఇళ్ల స్థలాలు

బంగారుపాళ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మురళీ మోహన్ చొరవతో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ సోమవారం తెలిపారు. తుంబపాళ్యం గ్రామానికి చెందిన మంజునాథ్, కుప్పమ్మ, హరీష్ ఆచారి, శంషాద్‌బీలు 30 ఏళ్లుగా తుంబపాళ్యం కుంటకట్టపైన చిన్నపాటి స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవారన్నారు. వీరిని ఖాళీ చేయాలని గత ప్రభుత్వ హయాంలో ఆర్డీవో, తహసీల్దార్లు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తుంబపాళ్యంకు ఎమ్మెల్యే వచ్చినప్పుడు తమ సమస్యను తెలియజేశారన్నారు. స్పందించిన ఆయన వెంటనే తహసీల్దారుకు ఫోన్‌చేసి వీరందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆదేశించారన్నారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో వీఆర్వో,సర్వేయర్‌లు తుంబపాళ్యంకు చేరుకుని ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలు కేటాయించారని వివరించారు. దీంతో ఎమ్మెల్యేకు, టీడీపీ మండల అధ్యక్షుడు ధరణీప్రసాద్,గౌరవ అధ్యక్షుడు జయప్రకాష్,సర్పంచ్ ఉషశ్రీ,నాయకులకు పేదలు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే మురళీమోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న పేదలు

రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం


కడపగుంట దళితవాడలో కరపత్రాలను అందజేస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో కడపగుంట, ఎల్లాపల్లె పంచాయతీల్లో నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు శ్రీధర్‌యాదవ్, మోహన్‌నాయుడు, దేవసుందరం, జ్యోతిరెడ్డి, హరీష్‌యాదవ్, కామసాని కోదండరెడ్డి,గజేంద్రనాయుడు, కిరణ్‌నాయుడు, ఆర్ముగం, షణ్ముగం, చిదంబరం,బాలకృష్ణ, ఏసుమలై, శివయ్య, స్టాండ్లీ,నియాజ్‌అలీ,మునిరాజులుయాదవ్,విభూషణ్,మునస్వామి పాల్గొన్నారు.

జీడీనెల్లూరు రీసర్వే డీటీగా శోభ

గంగాధరనెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా పులికల్లు శోభ బాధ్యతలు స్వీకరించారు. వి.కోట మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ మహేష్ కుమార్‌లను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.



నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

● హెచ్‌ఎంలకు డీవైఈవో సూచన

చిత్తూరు సెంట్రల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని చిత్తూరు డీవైఈవో ఇందిర సూచించారు. ఈ అంశంపై దుర్గానగర్ కాలనీలోని సీఎంఎస్ఎస్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఏడుగురు మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

యాదమరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని యాదమరి సింగిల్ విండో చైర్‌పర్సన్ చిత్రా నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. డీసీసీబీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కుమార్, డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్, సర్పంచ్ హేమయ్య నాయుడు, నాయకులు వల్లేరు అమరనాథ నాయుడు, గోపి గౌడ్, యాదమరి పీఏసీఎస్ సీఈవో గుణశేఖర్ పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు

పెరిగిన దోమల బెడద ● ఇబ్బంది పడుతున్న స్థానికులు



పెనుమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పంచాయతీలోని బీసీ కాలనీ వద్ద రోడ్డు పక్కనే మురుగు గుంత ఉంది. ఇది నిండిపోయి రోడ్డుపై మురుగు పారుతోంది. మరోవైపు ఇదమురుగు గుంతలో దోమలు పెరిగిపోయాయి. దీనివల్ల కాలనీవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు అటువైపున డ్రైనేజీ పైపులైను ఉంది. దీనికి మురుగును మళ్లిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రెండ్రోజుల్లోపు సమస్యలు పరిష్కరించండి: తహసీల్దార్

బంగారుపాళ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన సమస్యలను రెండ్రోజుల్లోపు పరిష్కరించాలని వీఆర్వోలు, సర్వేయర్లకు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

పూతలపట్టు ఎస్ఐగా తేజస్విని

పూతలపట్టు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎస్ఐగా డి.తేజస్విని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ట్రైనింగ్ పూర్తిచేశాక తొలిసారి స్టేషన్‌కు ఎస్ఐగా నియమితులయ్యారు.



'పోష్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు విధులు నిర్వహించే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నుంచి కాపాడే పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ ఎట్ వర్క్ ప్లేస్) చట్టానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి: కమిషనర్

చిత్తూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 4, పింఛన్లకు 3, రెవెన్యూకు ఒకటి చొప్పున 8 అర్జీలు అందాయి. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.


అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

యాదమరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను విశ్రాంత ఉపాధ్యాయుడు త్యాగరాజు నాయుడు సోమవారం వితరణ చేశారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సుల్తాన్, మదన్‌మోహన్ రెడ్డి, చిన్నదొరై, మధుబాబు, దామోదర్ రెడ్డి, రంగనాథం, భారతి, మంజుల, మహేష్, షణ్ముగం పాల్గొన్నారు.



నందీశ్వరుడికి రుద్రాభిషేకం

వెదురుకుప్పం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి శ్రావణ సోమవారం శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి శ్రావణ సోమవారం సందర్భంగా పాలాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

విస్తారంగా సజ్జ సాగు

విజయపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలో సజ్జను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. మాధవరం, ఆలపాకం, కళియంబాకం, పన్నూరు, జగన్నాథపురం, కాళికాపురం, కేవీపురం, జీఎంపురం, ఇళ్లత్తూరు ప్రాంతాల్లో సుమారు 300 ఎకరాల్లో సాగవుతోంది. పంట ప్రస్తుతం పూత దశకు చేరుకుందని రైతులు తెలిపారు.



3న చెస్ పోటీలు

నగరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని అశ్విని కన్వెన్షన్ హాలులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన యువతీ యువకులకు చెస్ పోటీలు ఆగస్టు మూడో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 16 కేటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఓపెన్ కేటగిరీ సీనియర్ విభాగంలో ఏ ప్రాంతంవారైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 94408 21444 నెంబరును సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి

పూతలపట్టు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ పోటీతత్వంతో చదవాలని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు కోరారు. పి.కొత్తకోట సమీపాన ఉన్న కళాశాలలో సోమవారం డిప్లమా ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సైకాలజిస్టు సుధీర్ సండ్ర, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, వైస్ ప్రిన్సిపాల్ సాయిశిరీష, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు - నృత్యం చేస్తున్న విద్యార్థిని

సంక్షిప్తంగా..

నేడు థామస్ పర్యటన

వెదురుకుప్పం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, జీడీనెల్లూరు మండలాల్లో ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ మంగళవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కార్వేటినగరం, కొటార్వేడులో పర్యటిస్తారు. 2.30గంటలకు గంగాధరనెల్లూరు మండలం కొట్రకోనలో జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో టీడీపీ శ్రేణులతో కలిసి పాల్గొననున్నారు.

విద్యాసామగ్రి వితరణ



ఐరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 35 యర్లంపల్లె, నాగమవాండ్ల, చెంగనపల్లె పంచాయతీల్లోని ఏడు ప్రాథమిక పాఠశాలల్లో చదివే 200 వందల మంది విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, పలకలను వాసు ట్రస్టు ద్వారా వితరణ చేశారు. ట్రస్టు నిర్వాహకుడు సూరిమానిరాజారామ్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా విద్యా సామగ్రిని వితరణ చేస్తున్నట్లు చెప్పారు. 35యర్లంపల్లె పాఠశాల హెచ్‌ఎం గంగిరెడ్డి, టీచర్లు జనార్ధన్, సుధాకర్, చలపతి, గుణసుందరి, కార్తిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలో సినీహీరో మాన్యంకృష్ణ నిర్వహిస్తున్న హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్-అన్నసూక్తమ్ కేంద్రం వద్ద నిరుపేదలకు అన్నం, పండ్లు, రొట్టెలను సోమవారం శేషాపురం గ్రామానికి చెందిన లోకేష్ అందజేశారు. వారంలో ఓ రోజు తనవంతుగా పేదలకు అన్నదానం చేస్తున్నానని చెప్పారు.

పీఎస్ఐగా అశోక్‌కుమార్

బంగారుపాళ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ట్రైనీ పీఎస్ఐగా అశోక్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పోలీసు ట్రైనింగ్‌లో భాగంగా ఆరు నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించనున్నారని సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు.



'పీ4' సర్వేపై సమీక్ష

విజయపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'పీ4' సర్వేపై ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అధికారులతో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర సమీక్షించారు. వీర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

బంగారుపాళ్యం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరుపల్లె దళితవాడకు చెందిన వెంకటస్వామి కుమారుడు భాస్కర్ (38) ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కల్లూరుపల్లె సమీపంలోని 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ టవర్‌కు తన షూలేస్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

రౌడీషీటర్‌కు రిమాండ్

చిత్తూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టుకు చెందిన ఆటో డ్రైవర్ సాధిక్(25)పై దాడి చేసిన చిన్ని అనే రౌడీషీటర్‌ను తాలుకా పోలీసులు సోమవారం రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 27వ తేదీన సాధిక్ తన స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా మురకంబుట్టు కూడలిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. అందులో సాధిక్‌తో పాటు టీడీపీ నేతల ఫొటోలు ఉండడాన్ని చూసి చిన్ని జీర్ణించుకోలేక పోయాడు. సాధిక్‌ను దూషించి, దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు చిన్నిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

ద్విచక్రవాహనం చోరీ

శ్రీరంగరాజపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని చోరీకి గురైంది. చిన్న తయ్యూరుకు చెందిన జనార్ధన్ సోమవారం ఉదయం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన తన ద్విచక్ర వాహనాన్ని పెట్టి పొలంలో పనులు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.